

**పకడ్బందీగా నిఘా**
ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను నియమించింది. - 10లో



**లెక్క పక్కాగా ఉండాల్సిందే..**
అభ్యర్థులు ఖర్చుల వివరాలను ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని అధికారులు సూచించారు. - 10లో



**నిస్వార్థ సేవలతోనే..**
నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని అటారీ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. - 12లో

## న్యూస్‌రీల్

### టీటీసీ లోయర్ గ్రేడ్ ఫలితాలు విడుదల

నల్లగొండ : టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు www.bse.telangana na.gov.in వెబ్‌సైట్ ద్వారా రోల్‌నెంబర్‌తో పరీక్ష ఫలితాలు, వెబ్ మెమోస్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### యూడైస్‌లో నమోదు చేయాలి

నల్లగొండ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వివరాలను యూడైస్‌లో చేర్చాలని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు జరుగనున్నందున దాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల వివరాలను యూడైస్ పోర్టల్‌లో నవంబర్ 4వ తేదీ అప్‌లోడ్ చేయాలని సూచించారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ లీగల్ కన్వీనర్ నేతి రఘుపతి పిలుపునిచ్చారు. నవంబర్ 4వ తేదీన హైదరాబాద్ జల విహార్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామరావు, బోయినపల్లి వినోద్‌కుమార్, కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోలి అమరేందర్‌రెడ్డి, సయ్యద్ జమీల్, సతీష్‌కుమార్, దాసరి యాదగిరి పాల్గొన్నారు.

### యాదాద్రిలో సంప్రదాయ పూజలు



జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి ఉదయం ఆకు పూజ నిర్వహించారు. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతోపాటు విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు వంటి పూజలు నిర్వహించారు.

### డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

భువనగిరిటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వివిధ రంగాల్లోని కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం భువనగిరిలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేల హామీ, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రతి రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. వర్క్‌షాప్‌లో జిల్లా సహాయ కార్యదర్శులు మాయ కృష్ణ, సిలివేరు రామకుమారి, బోడ భాగ్య, సుబ్బారు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు పొట్ట యాదమ్మ, పోతరాజు జహంగీర్, గాడి శ్రీను, ఆంజనేయులు, మాతయ్య, పుప్పాల గణేష్, గడ్డం వెంకటేష్, మొరిగాడి రమేష్, మంచాల మధు, మారయ్య, బందెల భిక్షం, జిల్లా నాయకులు తూటి వెంకటేష్, గ్యార సురేష్, శివ, రాము, సుజాత, వరలక్ష్మి పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి




మిర్యాలగూడ ప్రజా ఆశీర్వాద సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే భాస్కర్‌రావు



దేవరకొండ సభలో నినదిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే రవీంద్రకుమార్

# నాగార్జున సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు



**సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం**

- ఈ ఏడాది సరైన వర్షాలు లేక కృష్ణానదికి నీళ్లు తక్కువ వచ్చాయి
- సాగర్ ప్రాజెక్టును ఏలేశ్వరం వద్ద కడితే నల్లగొండకు నీరు సమృద్ధిగా వచ్చేది
- ఆ నాడు కాంగ్రెస్ నాయకులు నోరు మూసుకున్నరు
- కాంగ్రెసోళ్ల 'స్టే'లతోనే డిండి ఎత్తిపోతలు ఆలస్యం
- హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్
- అభివృద్ధిని వివరిస్తూనే.. ప్రతిపక్షాలపై విమర్శలు

దేవరకొండ సభలో కార్యకర్తల కేరింత



మిర్యాలగూడ: నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో నీటికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా భవిష్యత్‌లో గోదావరి జలాలను మళ్లిస్తామని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గోదావరి జలాలను ఉదయ సముద్రం ద్వారా పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు తీసుకొచ్చి దాని ద్వారా సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. మంగళవారం హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ ప్రసంగించారు. ఈ ఏడాది ఆశించిన వర్షాలు లేకపోవడంతో కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా వచ్చాయని, ఉన్నదాంట్లోనే సాగు, తాగునీటికి సర్దుతున్నామన్నారు. ఆయకట్టులో ఎప్పుడు నీటి కోసం ఏదో ఒక ఉద్యమం జరుగుతూనే ఉంటుందన్నారు. ఆనాడు సాగర్ టేయిల్‌లాండ్ భూములకు నీటిని విడుదల చేయాలని పెద్ద ఉద్యమం జరిగిందని, అప్పుడు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తిప్పన విజయసింహారెడ్డి ఉన్నారని, నీటి విడుదల కోసం వేలాది మంది రైతులతో అధికారులను నిలదీశామన్నారు. నీళ్లు ఇవ్వకపోతే కాల్వ తూములను బద్దలు కొడ్తామని హెచ్చరించడంతో.. తెల్లారేలోపే నీళ్లు వచ్చాయన్నారు. 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దళితులను పట్టించుకోలేదని.. వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకే దళితబంధు పథకాన్ని తీసుకొచ్చామన్నారు. శుద్ధమైన మంచినీరు అందించాలని మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి గోస తీర్చామన్నారు.

**కీలక నిర్ణయాల్లో భాస్కర్‌రావు భాగస్వామ్యం**

మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు చాలా హుషారుగా ఉన్నాడని, అతను ఇమాందారి (న్యాయబద్ధం)గా పని చేస్తారని పొగిడారు. ప్రభుత్వం నిర్ణయాల్లో భాస్కర్‌రావు పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. భాస్కర్‌రావు నాకు కుడి భుజం లాంటివాడని, భాస్కర్‌రావు లేకుండా ఏ కీలక చర్చలు చేయలేదన్నారు. వ్యక్తిగత పనుల కోసం ఏనాడూ తన వద్దకు రాలేదని, నిత్యం చెక్ డ్యాంలు, లిఫ్టుల విషయంపైనే తన వద్దకు వచ్చారని తెలిపారు. భాస్కర్‌రావు పనుల గురించి వస్తుంటారని నా సెక్యూరిటీ కూడా చెప్పుకుంటారని సీఎం పేర్కొన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు ఇప్పించడంలో, పరిహారం అందించడంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఎంతో కృషి చేశారన్నారు. ఇంతమంచి మనిషిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపిస్తే స్థానిక నిరుద్యోగులకు పవర్‌ప్లాంట్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్ బైరం బుచ్చయ్య, జెడీప కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నల్లమోతు చైతన్య, సిద్దార్థ, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రెండు పంటలకు 18సార్లు నీళ్లిచ్చాం**

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టుకు తొమ్మిదేళ్లలో రెండు పంటలకు 18 సార్లు నీళ్లిచ్చినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ ఏడాది కృష్ణా నదికి అనుకున్నంత నీరు రాపోయినా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్ అభ్యర్థన మేరకు అధికారులను పిలిచి మాట్లాడి నీళ్లు వదిలినట్లు తెలిపారు. 'మీ ఎమ్మెల్యే సైదిరెడ్డి అభ్యర్థన మేరకు మళ్లీ ఒక సారి నీరు వదులుతాం' అని కేసీఆర్ హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ కట్టాల్సింది ఏలేశ్వరం వద్ద అని అక్కడ కట్టి ఉంటే నల్లగొండ జిల్లాకు నీరు వచ్చేది అని అన్నారు. ఆ నాడు ప్రాజెక్టు కింద కడుతుంటే కాంగ్రెస్ నాయకులు నోరు మూసుకున్నారని విమర్శించారు. జాన్‌పహాడ్ లిఫ్ట్, ముక్త్యాల మేజర్ లైనింగ్ కోసం ఎమ్మెల్యే సైదిరెడ్డి తనతో కొట్లాడుతున్నారని కేసీఆర్ చెప్పారు. 'ఎమ్మెల్యేగా సైదిరెడ్డిని గెలిపిస్తే మీకు కావాల్సిన వాటిని నేను చేయిస్తాను' అని సీఎం హామీ ఇచ్చారు. సభలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, టీఎస్ఐఎస్‌సీ చైర్మన్ బాలమల్లు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి రజిత, నియోజకవర్గ పార్టీ మాజీ ఇన్‌చార్జ్ కాసోజు శంకమ్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జేవీఆర్, జెడ్పీటీసీ సభ్యులు కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, ఎంపీపీ పార్వతి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ జయబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్, నాయకులు నరేందర్‌రెడ్డి, వి. నర్సింహారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, అమర్‌గౌడ్, హరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

**మరోసారి.. మూడు గంటల్లో మూడు సభలు**



సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు గంటల సమయంలో మూడు సభల్లో పాల్గొని ప్రసంగించారు. ముందుగా మధ్యాహ్నం 2.49 గంటలకు హెలికాప్టర్‌లో హుజూర్‌నగర్‌కు చేరుకున్నారు. అక్కడ సభలో ప్రసంగించిన అనంతరం 3.45 గంటలకు మిర్యాలగూడకు వచ్చారు. సాయంత్ర 4 గంటలకు మిర్యాలగూడలో హెలికాప్టర్ దిగారు. ఇక్కడ సభలో 25 నిమిషాల పాటు ప్రసంగించారు. అక్కడి నుంచి 4.58 గంటలకు దేవరకొండకు బయలుదేరారు. సాయంత్రం 5.27 గంటలకు దేవరకొండ చేరుకున్న కేసీఆర్.. ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన అనంతరం 5.48 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.



**ఎన్నికల తర్వాత వస్తా.. ప్రాజెక్టులు పరిశీలిస్తా..**

దేవరకొండ : ఎన్నికల తర్వాత దేవరకొండకు వస్తా.. ఇక్కడి ప్రాజెక్టులను పరిశీలించి వాటిని పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కాంగ్రెసోళ్ల కేసులతో వచ్చిన స్టేల వల్ల డిండి లిఫ్టు పనులు ఆలస్యమయ్యాయని, కేంద్రం కూడా ప్రస్తుతం డిండి లిఫ్టులకు సంబంధించి సానుకూలంగా స్పందించిందని చెప్పారు. రానున్న కొద్ది రోజుల్లోనే దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకొని సాగు, తాగునీటి కష్టాలను దూరం చేసుకుందామన్నారు. మా తండాలో మా రాజ్యం అన్న విధంగా గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి, గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌దని అన్నారు. దేవరకొండ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ చాలా సౌమ్యుడని, నియోజకవర్గ అభివృద్ధిపై తనను కలిసినప్పుడల్లా తనతో చర్చిస్తుంటాడని అన్నారు. ఎన్నికల్లో మీ ఎమ్మెల్యేను డబుల్ మెజార్టీతో గెలిపించాలని సీఎం కోరారు. దేవరకొండకు మరో రెండు లిఫ్టులతో పాటు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ముఖ్యమంత్రిని కోరడంతో స్పందించిన ముఖ్యమంత్రి ఎమ్మెల్యేగా రవీంద్రకుమార్‌ను గెలిపిస్తే నెల రోజుల్లో కళాశాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్య మంత్రి మాట్లాడిన ఏడు నిమిషాలు రాష్ట్రంలో జరి గిన అభివృద్ధిని వివరిస్తూనే ప్రతిపక్షాలను విమర్శించారు. ఈ సభలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, గుత్తా అమిత్‌రెడ్డి, కేతావత్ బీల్యానాయక్, జడ్పీటీసీలు మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, వంగాల ప్రతాప్‌రెడ్డి, కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, సునితాజనార్దన్‌రావు, టి.వి.ఎన్.రెడ్డి, సర్వయ్య, బాలునాయక్, లింగారెడ్డి, సుధీర్‌రెడ్డి, యుగేందర్ రెడ్డి, వేముల రాజు, సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియకు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : శాసనసభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. మంగళవారం ఆయన నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నల్లగొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. నవంబరు 3 నుంచి నామినేషన్ల స్వీకరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారికి సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అకౌంటింగ్ టీం, వీవీటీ, సీ విజిల్ హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, నామినేషన్ సమయం రికార్డు చేయాలన్నారు. నామినేషన్ సందర్భంగా 100 మీటర్ల పరిధిలో మార్కింగ్ చేసి నామినేషన్లు వేసేందుకు అభ్యర్థి, ప్రతిపాదకులు, వాహనాలను ఎన్నికల నిబంధనల మేరకు అనుమతించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రవి, తహసీల్దార్ టూటౌన్ ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.



ఆర్‌ఓ కార్యాలయంలో వీవీటీ, సీవిజిల్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్



ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కర్ణన్

**కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ**

నల్లగొండ : రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ కలెక్టరేట్ అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తామని.. సర్దార్ వల్లబాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ మో మోతీలాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్
- అనుముల, కనగల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

హాలియా : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుముల మండలంలోని పులిమామిడి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ధాన్యం విక్రయం, గన్ని బ్యాగుల కొరత, రవాణా, అన్‌లోడింగ్, తరుగు, చెల్లింపు, కొనుగోళ్లపై ఎటువంటి సమస్య ఉన్నా నోట్ చేసుకొని సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే ట్రాన్స్‌పోర్ట్ అయ్యేలా చూడడంతో పాటు ఆ వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం కళావతి, సీసీ, వీఏఓ సంఘ బంధం సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.



పులిమామిడిలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**ట్యాబ్ ఎంట్రీ పరిశీలన**

కనగల్ : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కనగల్ మండలంలోని శేరిలింగోటం గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఎం నరహరి, ఏఈఓ అభిలాష్‌రెడ్డి తదితరులున్నారు.

# సైన్స్ డ్రామా పోటీలతో నైపుణ్యం వెలుగులోకి..

నల్లగొండ : విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక నైపుణ్యాల వెలికితీసేందుకు సైన్స్ డ్రామా పోటీలు దోహదపడతాయని డీఈఓ బి.భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం డైట్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సదరన్, ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లెట్, నాణ్యమైన ఆహారం, ఆహార భద్రత, రోజు వారి జీవితంలో ఆధునిక సాంకేతికత, ఆరోగ్య సంరక్షణలో ప్రస్తుత పురోగతి, సమాజంలో మూఢ నమ్మకాలు అనే అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన డ్రామాలు అలరించాయన్నారు. మాడ్గులపల్లి విద్యార్థులు ప్రదర్శించిన మిల్లెట్స్ నాణ్యమైన ఆహారం ప్రదర్శన ప్రథమ బహుమతికి ఎంపికైందని తెలిపారు. ద్వితీయ బహుమతికి ప్రభుత్వ బాలికల పాఠశాల (నల్లగొండ), తృతీయ బహుమతికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తిప్పర్తి), ప్రోత్సాహక బహుమతికి నల్లగొండలోని శాస్త్ర ఉన్నత పాఠశాల ఎంపికైందని తెలిపారు. ప్రథమ బహుమతి పొందిన విజేతలు ఈ నెల 8న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హులవుతారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతగా కేపీఎం ప్రభుత్వ కళాశాల లెక్చరర్ సింగం శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దేవరకొండ



దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రకుమార్


పాటలు పాడుతున్న సింగర్ మధుప్రియ


కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ


మిర్యాలగూడ ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు దట్టీ కడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్


తన కుమారులైన సిద్దార్థ, చైతన్యను సీఎంకు పరిచయం చేస్తున్న నల్లమోతు భాస్కర్‌రావు


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హుజూర్‌నగర్



హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


వేదికపై నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి సతీమణి రజిత, మహిళా నేతలు

## హుజూర్‌నగర్ రూపురేఖలు మారాయి: సైదిరెడ్డి



హుజూర్‌నగర్ రూరల్, మేళ్లచెరువు: బీఆర్ఎస్ పాలనలోనే హుజూర్‌నగర్ రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.4వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి 90శాతం పూర్తిచేశామన్నారు. ఆర్డీఓ కార్యాలయం, ఎస్ఎస్పీ కాల్వ లైనింగ్, జాన్‌పహాడ్ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తికావొచ్చినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. పోడు భూములకు పట్టాలు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ కారణంగా పంచలేకపోయినట్లు చెప్పారు. సాగర్ నీరు విడుదల చేసి రైతుల పంటలు కాపాడామన్నారు. మరోసారి సాగర్ నీరు విడుదల చేయాలని సీఎంను కోరామన్నారు. జాన్‌పహాడ్ దర్గా, మేళ్లచెరువు జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి రూ.50లక్షలు ఇచ్చిందని గుర్తుచేశారు. మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, ఢిల్లీలో ఉండే ఉత్తమ్‌కుమార్ రెడ్డి కావాలో, నిత్యం ప్రజల మధ్య ఉండే సైదిరెడ్డి కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు.

## కేసీఆర్ కాళ్లు మొక్కైనా ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా : భాస్కర్‌రావు



మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ కాళ్లు మొక్కైనా నెరవేరుస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. మిర్యాలగూడకు మెడికల్ కాలేజీ, ఐటీ హబ్, ప్రభుత్వ మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సీఎంను కోరానన్నారు. నియోజకవర్గంలో రూ.2526 కోట్లతో సంక్షేమం, రూ.2971 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రూ.400 కోట్లతో మిర్యాలగూడ మున్సిపాలిటీని అభివృద్ధి చేశానన్నారు. 3,200 మందికి సీఎం సహాయ నిధి కింద రూ.15కోట్లు అందించామన్నారు. రూ.1000 కోట్లతో ఐదు ఎత్తిపోతల పథకాలను(లిఫ్టులను) నిర్మిస్తున్నామని, అవి పూర్తయితే 50వేల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుందన్నారు. రూ.16 కోట్లతో ఏరియా ఆస్పత్రిని 200పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని అన్నారు. రూ.130 కోట్లతో చేపట్టిన సాగర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు.


దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు


హుజూర్‌నగర్ సభలో యువకుల ఉత్సాహం

# లెక్క పక్కాగా ఉండాల్సిందే..

- ప్రతిరోజూ అభ్యర్థి ఎన్నికల ఖర్చు లెక్కలు సమర్పించాలి
- విధిగా ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన ఈసీ
- ఎన్నికలయ్యే వరకు ఒక్కో అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు ఎలక్షన్ కమిషన్ కఠినంగా వ్యవహరించనుంది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలను ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటిని అమలు చేసేందుకు కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 3వ తేదీన నామినేషన్ల ప్రారంభం నుంచి ఇది అమలులోకి రానుంది. కాగా ఇప్పటికే జిల్లాలో డబ్బు, మద్యం అక్రమ రవాణాకు నియంత్రించేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన పోలీసు యంత్రాంగం వాహనాల తనిఖీని ముమ్మరంగా చేపడుతోంది. నామినేషన్ల కంటే ముందు పెడుతున్న ఖర్చు పార్టీ ఖాతాలోకి రానున్నది. పార్టీ తరఫున అభ్యర్థి పోటీలో ఉంటే ఈ ఖర్చులను కూడా అభ్యర్థి ఖర్చుగానే పరిగణిస్తారు.



రూ.40లక్షలకు వరకు..

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు మించకూడదని ఎన్నికల సంఘం నిర్ణయించింది. 2018 ఎన్నికల్లో ఈ మొత్తం రూ.18 లక్షలుగా ఉండేది. గతంలో ఎన్నికల ఖర్చును మూడు రోజులు లేదా వారానికోసారి లేదా పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ వరకు కూడా లెక్క చూపే అవకాశం ఉండేది. ప్రస్తుతం అభ్యర్థి తాము చేస్తున్న ఖర్చును రోజువారీగా చూపించాలనే నిబంధన అమలులోకి వచ్చింది. ఖర్చుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి విధిగా ఎప్పటికప్పుడు సమరిపంచాల్సిందే. అంతేకాకుండా ఈ వివరాలను ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా నేరచరిత్ర కలిగిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేస్తే వాటికి సంబంధించిన ఆధారాలను కూడా అఫిడవిట్‌లో నామినేషన్ సమయంలో విధిగా నమోదు చేయాలని పేర్కొన్నది. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన దాని కంటే ఎక్కువ బిల్లులు చూపితే అనుమతించబడదు.

### ఎన్నికల కమిషన్ నిర్ణయించిన బిల్లులు ఇలా

| సామగ్రి | పట్టణం(రూ.లలో) | గ్రామీణం(రూ.లలో ) | | | |
|---|---|---|---|---|---|
| లౌడ్‌స్పీకర్లు | 300-900 | 300-800 | సుమో (నాన్ ఏసీ) | 1,600 | 1,600 |
| బహిరంగ సభా వేదిక | 2,000 | 2,000 | వ్యాన్, డీసీఎం | 3,500 | 3,500 |
| ఫ్లెక్సీ విలువ (10/10) | 1,200 | 1,200 | కారు | 2,000 | 2,000 |
| క్లాత్ బ్యానర్లు(12/2) | 200 | 200 | ఇన్నోవా | 4,000 | 4,000 |
| జెండాలు | 30 | 30 | అద్దె గదులు | 800-1,800 | 600-1,500 |
| పోస్టర్ (18/23) | 6 | 6 | కుర్చీలు | 8 | 8 |
| పోస్టర్ (మల్టీకలర్) | 8 | 8 | కార్పెట్ | 250-350 | 200-250 |
| హోర్డింగ్‌లు | 5,000 | 5,000 | సైడ్‌వాల్ | 80 | 60 |
| చెక్క కటౌట్‌లు | 8,000 | 8,000 | టెంట్ | 400-1,000 | 400-800 |
| ప్లాస్టిక్ కటౌట్లు | 4,500 | 3,500 | భోజనం | 80 | 80 |
| ఫొటోలు, వీడియోలు | 1,800 | 1,800 | టీలు | 10 | 8 |
| పెన్‌డ్రైవ్ | 300 | 300 | టిఫిన్స్ | 35 | 30 |
| ఆడియో క్యాసెట్ | 300 | 300 | టోపీలు | 20 | 20 |
| జీపు కిరాయి | 2,000 | 2,000 | జెండాలు | 15 | 15 |
| టెంపో, ట్రక్ కిరాయి | 3500 | 3500 | టవల్స్ | 25 | 25 |
| సుమో (ఏసీ) | 2,800 | 2,800 | టీ షర్ట్స్ | 75 | 75 |

# ప్రత్యేక బృందాలు.. పకడ్బందీగా నిఘా

- ఎన్నికల కోడ్ అమలుకు 24 గంటలు విధుల్లో టీంలు
- చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా

**సూర్యాపేట జిల్లాలో టీంలు..**
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు- 33
- స్టాటిస్టిక్ సర్వేలైన్స్ బృందాలు- 25
- వీడియో సర్వేలైన్స్ బృందాలు- 8

**నల్లగొండ జిల్లాలో టీంలు..**
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు- 21
- స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్ బృందాలు- 19
- వీడియో సర్వేలైన్స్ బృందాలు- 8

**యాదాద్రి జిల్లాలో టీంలు..**
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు- 17
- స్టాటిస్టికల్ సర్వేలైన్స్ బృందాలు- 17
- వీడియో సర్వేలైన్స్ బృందాలు- 12

దురాజ్‌పల్లి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను నియమించింది. ఇప్పటికే నిబంధనలను విరుద్ధంగా తీసుకెళ్తున్న నగదు, బంగారంతో పాటు మద్యం పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల సరిహద్దుల్లో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు, పోటీలో ఉండే వారు ఆయా నియోజకవర్గాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంది.

**ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు..**

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మోడల్ కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలిస్తారు. మద్యం, నగదు, ఇతర వస్తువులతో ఓటర్లను ప్రలోభపెడుతున్నారా అని ఆరా తీస్తారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల తరఫున ఖర్చుల వివరాలు నమోదు చేస్తారు. ర్యాలీలు, బహిరంగ సభల్లో అభ్యర్థులు ఖర్చు చేసిన వాటిపై వీడియో తీస్తారు. ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే ఈ బృందాలు చేరుకుంటాయి. 24 గంటలు మూడు విడతలుగా పనిచేస్తారు. ఒక్కో బృందంలో మెజిస్ట్రేట్ హోదాలో అధికారి, ఆయనతో పాటు మరో ముగ్గురు సిబ్బంది ఉంటారు. అయితే వీరు సీజ్ చేసిన డబ్బును పోలీసులకు అప్పగిస్తారు. పోలీసులు వాటిని ట్రెజరీలలో డిపాజిట్ చేస్తారు. సీజ్ చేసిన డబ్బుకు సంబంధించి ఆధారాలు చూపిస్తే అధికారుల ఆ డబ్బును రిలీజ్ చేస్తారు.

**స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్ బృందాలు..**

ఈ టీంలు అన్ని చెక్‌పోస్టుల వద్ద ఉంటాయి. తనిఖీలు చేసే ప్రతీది వీడియో తీస్తారు. మెజిస్ట్రేట్ ద్వారా పరిశీలించి పట్టుబడిన నగదు, ఇతర వస్తువులను ఎన్నికల అధికారికి, ఆర్వోకు తెలుపుతారు. రూ.50వేలకు పైగా నగదు, రూ.10వేలకు పైగా ఎన్నికల సామగ్రి వాహనాల్లో లభ్యం అయితే సీజ్ చేస్తారు. పెద్దఎత్తున నగదు ఉన్నట్లయితే ఆదాయ పన్ను శాఖ ద్వారా జప్తు చేస్తారు. ఒక్కో టీంలో ఒక అధికారితో పాటు 3 పోలీసులు ఉంటారు.

**వ్యూయింగ్ టీమ్స్..**

వీడియో సర్వేలైన్స్ బృందాలు సీడీ రూపంలో ఇచ్చిన వీడియోలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఎన్నికల నియమావళి, ప్రతి రోజు చేపట్టే ప్రచారాలు, వ్యయాలు, అకౌంటింగ్ టీమ్స్ ఖర్చుల వివరాలు పరిశీలిస్తారు.

**గ్రీవెన్స్ కమిటీ..**

ఈ కమిటీలో జిల్లా పరిషత్ సీఈఓతో పాటు డీసీఓ, జిల్లా ట్రెజరీ అధికారులు ఉంటారు. జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఆధారాలు చూపకుండా సీజ్ చేసిన డబ్బును ఆధారాలు చూపిస్తే 24 గంటల్లో రిలీజ్ చేస్తారు. అయితే ఏరోజుకు ఆ రోజు పట్టుకున్న డబ్బును పరిశీలించి రాజకీయ పార్టీలకు సంబంధించినది కాకుంటే ఆధారాలు చూపించిన వెంటనే విడుదల చేయాల్సి ఉంటుంది.

**వీడియో సర్వేలైన్స్ బృందాలు..**

ఈ టీంలు రాజకీయపార్టీల ర్యాలీలు, మీటింగ్‌లను వీడియో తీస్తారు. వాటిని ఆర్వోలకు అందిస్తారు. తేదీ, స్థలం, పార్టీ వివరాలు, అభ్యర్థి నిర్వహించే సమావేశం, పోస్టర్లు, కటౌట్లు, బ్యానర్లు, నగదు, డ్రైవర్లు మొత్తం వీడియో తీసి ఆయా అభ్యర్థి, పార్టీలకు సంబంధించిన ఖాతాలో జమ చేస్తారు. వీటిని కౌంటింగ్ టీం షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఇవన్నీ అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. వీరంతా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఎక్స్‌పెండీచర్ అధికారికి అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అధికారిగా పనిచేస్తారు.

## ఓటరు హెల్ప్‌లైన్ నంబర్ 1950

భువనగిరిటౌన్ : ఎన్నికల సమయంలో ఓటర్లకు వచ్చే సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం కలెక్టరేట్లలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సహాయ కేంద్రం 24 గంటలు పనిచేస్తుంది. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా.. 1950 నంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ కేంద్రాలకు ఎక్కువగా ఓటరు జాబితాకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయి. దరఖాస్తు చేసినా ఓటరు జాబితాలో పేరు లేదని కొందరు, ఈసారి పోలింగ్ కేంద్రం మారిందని ఇంకొందరు ఫోన్ చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండడంతో ఫిర్యాదుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను వెంటనే రిటర్నింగ్ అధికారికి పంపి అక్రమాల కట్టడికి చర్యలు తీసుకోనున్నారు.

# ఓటర్లకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం

- మహిళలు, యువత, దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

చిట్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు గాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 నియోజకవర్గాలలో 60 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గంలోని ఆయా మండలాలలో ఐదు చొప్పున ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు చేశారు. 'సఖీ' పేరుతో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంలో మహిళలు ఓటు వేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ×యువ¶ పేరుతో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువత, దివ్యాంగులు ల కోసం 'ఆదర్శ' పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అందంగా పూలమొక్కలు, బెలూన్స్, పూలదండలతో అలంకరిస్తారు. అంతేకాకుండా ఓటేసేందుకు వచ్చిన వారికి రెడ్ కార్పెట్ పరిచి స్వాగతం పలకనున్నారు. 'సఖీ' పోలింగ్ కేంద్రంలో మహిళలే విధులు నిర్వహించనుండటం విశేషం. అంతేకాకుండా ఈ పోలింగ్ కేంద్రాలకు ఓట్లే వేసేందుకు వచ్చిన వారికి ప్రత్యేక బహుమతులు అందించటంతో పాటు గులాబీ పువ్వులను అందించి అధికారులు స్వాగతం పలుకుతారు.



పెద్దకాపర్తిలో గత ఎన్నికల్లో ఏర్పాటు చేసిన సఖీ ఆదర్శ పోలింగ్ కేంద్రం (ఫైల్)

## జర్నలిస్టులకూ పోస్టల్ బ్యాలెట్



నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో జర్నలిస్టులు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అక్రిడిటేషన్ కార్డు కలిగి ఉండి పోలింగ్ అథారిటీ లెటర్‌కు పేర్లు ఇచ్చిన జర్నలిస్టులకు మాత్రమే 12–డీ ఫాం ఇస్తామని, ఆ ఫాంకు అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ జత చేసి జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని నల్లగొండ డీపీఆర్ఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## ఆస్పత్రి యాజమాన్యానికి జరిమానా

రామగిరి(నల్లగొండ) : ఓ గృహిణికి నిర్లక్ష్యంగా శస్త్రచికిత్స చేసి గర్భసంచి తొలగించి ప్రాణపాయ స్థితికి కారణమైన ఓ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యానికి జరిమానా విధిస్తూ నల్లగొండ వినియోగదారుల కమిషన్ మంగళవారం తీర్పు ఇచ్చింది. వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన తకడమళ్ల హిమబిందు అనారోగ్యంతో 2019లో నల్లగొండలోని సాయి శ్రీనివాస్ ఆస్పత్రికి వెళ్లింది. ఆ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పాల్వాయి అజయ్‌రెడ్డిని సంప్రదించింది. దీంతో డాక్టర్ అజయ్‌రెడ్డి మహిళలకు ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా గర్భసంచిలో సమస్య ఉందని, వెంటనే తొలగించాలని అనస్తీషియా డాక్టర్ సంతోష్‌మూర్తితో కలిసి లాప్రోస్కోపిక్ చికిత్స ద్వారా గర్భసంచి తొలగించాడు. అనంతరం వారం రోజుల తర్వాత బాధితురాలు అనారోగ్యానికి గురైంది. వెంటనే డాక్టర్ అజయ్‌రెడ్డిని సంప్రదించగా ఆపరేషన్‌తో పెద్దపేగుకు గాయం అయ్యిందని, మరో ఆపరేషన్ చేయాలని రెండో సారి ఆపరేషన్ చేయడంతో తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాపాయ స్థితికి వెళ్లింది. దీంతో మహిళను మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలించాలని సూచించాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ప్రాణాప్రాయ పరిస్థికి కారణమైన సాయి శ్రీనివాస్ ఆస్పత్రి డాక్టర్లను నిలదీయగా బాధితురాలిని బెదిరించారు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించడంతో ఆస్పత్రి యాజమాన్యం బాధితురాలికి రూ.10లక్షల నష్టపరిహారంతో పాటు, ఆస్పత్రి ఖర్చులకు రూ.లక్షా 39వేలు, న్యాయవాది ఫీజు రూ.20వేలు చెల్లించాలని కమిషనర్ మామిడి క్రిష్టోఫర్, సభ్యులు ఎస్.సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు తీర్పును వెలువరించారు.

## ఏడుగురి బైండోవర్

మోతె : మండలంలోని ఉర్లుగొండ గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను స్థానిక తహసీల్దార్ ప్రకాష్‌రావు సమక్షంలో రూ.లక్ష పూచికత్తుతో బైండోవర్ చేసినట్లు మండల ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారిపై గతంలో పలు కేసులు నమోదైన నేపథ్యంలో ఎన్నికల నియమావళిలో భాగంగా బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో పోలీసులకు సహకరించాలన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్ : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన పట్టణ పరిధిలోని ఎంఎస్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎస్‌నగర్‌లో నివాసం ఉంటున్న వెల్లంకి కృష్ణకుమారి గత నెల 11న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగలకొట్టి ఉంది. దీంతో బాధితురాలు ఇంట్లోకి వెళ్లి చూడగా నాలుగు వెండి గ్లాసులు, రూ.15వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై ఏఎస్ఐ కేపీ చారి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు మృతి

నాంపల్లి : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన నాంపల్లి మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన పెందోట మల్లయ్య (49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లయ్య సాయంత్రం వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అయితే, మల్లయ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, వివాహమైన కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

## విద్యుత్ మోటారు చోరీ

మునగాల : మండల కేంద్రం శివారులో గల సాగర్ ఎడమకాలువపై ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైన సంఘటన జరిగింది. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు సంఘం నాయకుడు దేవరం (లిఫ్ట్)వెంకటరెడ్డి సాగర్ ఎడమకాలుపై మోటారు ఏర్పాటు చేసి వ్యవసాయం సాగు చేస్తున్నాడు. కాగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి రూ.25వేల విలువగల మోటారును చోరీ చేసినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అనారోగ్యంతో జర్నలిస్టు మృతి

హుజూర్‌నగర్ రూరల్ : హుజూర్‌నగర్ నియోజకవర్గ టీవీ జర్నలిస్టు బత్తిని శోభన్‌బాబు (38) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల హుజూర్‌నగర్ టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు, హుజూర్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లలమర్రి శ్రీనివాస్, కీత రామనాథం, ఉపాధ్యక్షులు బసవోజు శ్రీనివాసచారి తదితరులు సంతాపం తెలిపి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తే ఉన్నారు.